సాక్షి
ఖమ్మం
గురువారం । 22 । ఆగస్టు । 2024



... వైరాకు ప్రాధాన్యత

ఎంపీ కోటా నిధుల కేటాయింపుల్లో వైరా నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇస్తానని లోక్‌సభ సభ్యుడు రఘురాంరెడ్డి తెలిపారు. 8లో



మొదలైన విద్యుదుత్పత్తి

కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారం వదో యూనిట్‌లో వార్షిక మరమ్మతులు పూర్తవడంతో విద్యుదుత్పత్తి మొదలైంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్ట స్థాయికి చేరుతుంది.

చెత్త గుట్ట.. కదలదంట!

డివిజన్లు	రోజు వారీ చెత్త సేకరణ
60	180 మెట్రిక్ టన్నులు
వాహనాలు 100కు పైగా..	ప్రస్తుతం అందుబాటులో ఉన్నది
డంపింగ్ యార్డు విస్తీర్ణం 38 ఎకరాలు	28 ఎకరాలు

కేఎంసీలో జటిలంగా మారిన డంపింగ్ యార్డు సమస్య

- నానాటికీ పేరుకుపోతున్న వ్యర్థాలు
- లోపలికి వెళ్లే మార్గం లేక సేకరణ నిలిపేసిన డ్రైవర్లు
- బయో మైనింగ్‌లో ఆలస్యం.. ఉద్యోగుల నిర్లక్ష్యమే కారణం



డంపింగ్‌యార్డులో చెత్తను తొలగిస్తున్న దోజర్

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో రోజువారీ చెత్త సేకరణ సాఫీగా జరుగుతున్నా వ్యర్థాలను వేయాల్సిన దంపింగ్ యార్డులో ఖాళీ లేక.. లోపలకు వాహనాలు వెళ్లే మార్గం కానరాక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఎప్పటికప్పుడు చెత్త గుట్టలను దోజర్లతో వెనక్కి నెట్టిస్తూ ఆ తర్వాత వచ్చే వాహనాలకు మార్గం సుగమం చేయాల్సి ఉంటుంది. కానీ అటు బయో మైనింగ్ ఆలస్యమవుతుండడం.. ఇటు ఉద్యోగుల పర్యవేక్షణ లోపంతో ఎక్కడికక్కడే చెత్త గుట్టలుగా పేరుకుపోయి ఎక్కడ వేయాలో తెలియక వాహనాల డ్రైవర్లు సమస్య ఎదుర్కొంటున్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్

గతంలో సాఫీగానే...

కేఎంసీ పరిధిలో సేకరించిన చెత్తను గతంలో ఒక పద్ధతి ప్రకారం డంపింగ్ చేయించే వారు. రాను రాను ఉద్యోగులెవరూ అటు వైపు ముఖం చూపకపోవడంతో చెత్తను ఎక్కడికక్కడే ఇష్టారాజ్యంగా వేస్తున్నారు. ఫలితంగా డంపింగ్‌యార్డు మొత్తం చెత్తతో నిండిపోయింది. ఈ క్రమంలో ఇప్పుడు వాహనాలు లోపలకు వెళ్లే పరిస్థితి కానరావడం లేదు. దీంతో బుధవారం వాహన డ్రైవర్లు చెత్త డంప్ చేసేందుకు నిరాకరిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. యార్డులో డంప్ చేసి రావడానికి గంటల తరబడి సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇదే సమస్యపై డ్రైవర్లు ఆందోళన నిర్వహించినా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు అదే పరిస్థితి ఎదురుకావడం గమనార్హం. అనంతరం డ్రైవర్లంతా మేయర్ పునుకొల్లు నీరజ నివాసానికి వెళ్లి సమస్యను వివరించారు. దీంతో ఆమె అధికారులతో మాట్లాడి వెంటనే డంపింగ్ యార్డుకు వాహనాలు వెళ్లేలా దారి శుభ్రం చేయించాలని సూచించగా వారు రంగంలోకి దిగడంతో డ్రైవర్లు వెళ్లిపోయారు.

మరెలా?

డంపింగ్ యార్డు నిర్వహణపై అధికారులు ఇకనైనా ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. బయో మైనింగ్ బాధ్యతలు దక్కించుకున్న సంస్థ ప్రతినిధులతో చర్చించి పనులు వేగంగా చేయించాలి. తద్వారా 38 ఎకరాల స్థలం అందుబాటులోకి వస్తుంది. ఆతర్వాత ఏ రోజుకారోజు చెత్తలో అవసరమైన వ్యర్థాలను కావాల్సిన కంపెనీలకు పంపిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అలాకాకుండా తాత్కాలిక ఏర్పాట్లతో సమయం గడిపితే ఈ సమస్య ఎప్పటికీ తీరే అవకాశం కానరావడం లేదు.

తరచూ అదే సమస్య

ఖమ్మం నగరవ్యాప్తంగా సేకరించిన వ్యర్థాలను పోసేందుకు దానవాయిగూడెంలో 38 ఎకరాల స్థలాన్ని డంపింగ్ యార్డ్‌కు ఏళ్ల క్రితమే కేటాయించారు. అయితే, రానురాను చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో బయో మైనింగ్ చేసి ఇతర సంస్థలకు వ్యర్థాలను అప్పగించి యార్డ్ మొత్తాన్ని శుభ్రం చేయించాలని నిర్ణయించారు. ఇలా బయోమైనింగ్ పనులను ఓ సంస్థకు అప్పగించగా పదెకరాల మేర వ్యర్థాలను తొలగించి ఆ స్థలాన్ని కేఎంసీ అధికారులకు అప్పగించారు. మిగిలిన 28ఎకరాల్లో వ్యర్థాలను డంప్ చేస్తుండగా కొన్నాళ్లు దారిలో వేయకుండా వాహనాలు చివరి వరకు వెళ్లేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించేవారు. అంతేకాక దారికి అడ్డంగా ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీయించేవారు. రానురాను వారు పట్టించుకోకపోవడంతో డంపింగ్ యార్డు మొత్తం మళ్లీ చెత్తతో నిండిపోయింది. అనుభవం, అర్హత లేని ఉద్యోగులను ఇన్‌చార్జ్‌లుగా నియమించడంతో ఈ సమస్య తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాక వాహన డ్రైవర్లు ఆందోళన చేసినప్పుడు దోజర్లతో చెత్తను పక్కకు తీయిస్తున్నా ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. దీనికి తోడు బయోమైనింగ్ వేగంగా పూర్తి చేయాల్సిన ప్రైవేట్ సంస్థ అలసత్వం కూడా సమస్యకు కారణమవుతోందని తెలుస్తోంది.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



జమలాపురంలో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన నాయకులు

ఎర్రుపాలెం: రాష్ట్రంలోనే కాక మధిర నియోజకవర్గంలో కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, కొత్తపాలెం, ఎర్రుపాలెం, వెంకటాపురంల్లో రూ.60 కోట్ల నిధులతో నిర్మించనున్న రహదారుల పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో భట్టి మాట్లాడుతూ మధిర నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో గెలిచిన తనకు డిప్యూటీ సీఎంతో పాటు ఆర్థిక శాఖ మంత్రి పదవి దక్కిందని.. తద్వారా తన చేతుల మీదుగా రైతులకు రుణమాఫీ చేయగలిగానని తెలిపారు. తద్వారా ఇక్కడి ప్రజలు వేసిన ఓటు విలువ పెరిగిందని చెప్పారు. కట్లేరు ఆధునికీకరణ, రహదారుల నిర్మాణం, జమలాపురం ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు త్వరలోనే నిధులు కేటాయిస్తానని భట్టి తెలిపారు. ఇక ఎర్రుపాలెం మండలాన్ని ఎన్నెస్పీ రెండో జోన్‌లోకి మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ డైరక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు నాయకులు శీలం ప్రతాపరెడ్డి, బండారు నర్సింహారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి, బొగ్గుల గోవర్దన్‌రెడ్డి, తుళ్లూరు కోటేశ్వరరావు, అనుమోలు కృష్ణారావు, తల్లపరెడ్డి నాగిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు భట్టి సమీక్ష

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులపై అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం సమీక్షించనున్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో చేయాల్సిన అభివృద్ధి పనులు, నిధుల విషయమై ఆయన చర్చించనున్నారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం..



చెరువుమాధారం ఎత్తిపోతల పథకం వద్ద జలాలకు పూజ చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తదితరులు

- త్వరలోనే మరింత అభివృద్ధి కోసం నిపుణులతో చర్చలు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండల కేంద్రాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండల కేంద్రంలోని రామదాసు ధ్యాన మందిరంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన ఆడిటోరియంను బుధవారం మంత్రి ప్రారంభించారు. తొలుత మందిరంలో పూజలు చేశాక రామదాసు కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ బౌద్ధక్షేత్రం, రామదాసు మందిరం ఉన్న నేలకొండపల్లిని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు నిపుణులతో చర్చిస్తామని తెలిపారు. కాగా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఇందిరమ్మ రాజ్యం లో పేదలకు న్యాయం జరిగేందుకు హామీలన్నీ అమలుచేస్తామని వెల్లడించారు. అనంతరం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన మంత్రి, రాయగూడెం వద్ద చెరువుమాధారం ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ నాయకులు వజ్జా రమ్య, స్వర్ణకుమారి, శాఖమూరి రమేష్, వెనికె జానకిరామయ్య, బచ్చలకూరి నాగరాజు, భద్రయ్య, బొందయ్య, జెర్రిపోతుల సత్యనారాయణ, రాయపూడి నవీన్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల బాధ్యత మాదే...

ఖమ్మంరూరల్: నిరుద్యోగ యువత భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రైట్ ఛాయిస్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పొంగులేటి శీనన్న ఉచిత కోచింగ్ క్యాంప్‌ను మంత్రి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి కసరత్తు మొదలుపెట్టగా, ఏటా ఖాళీల ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేపడుతామని తెలిపారు. అంతేకాక నిరుద్యోగుల కోసం జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించనున్నామని మంత్రి తెలిపారు. అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ప్రజాసేవకు అంకితమయ్యే మంత్రి శ్రీనివాసరెడ్డి వంటి వారు రాజకీయాల్లో అరుదుగా ఉంటారని కొనియాడారు. ఈకార్యక్రమంలో సెంటర్ నిర్వాహకుడు మెండెం కిరణ్, జ్యోతిరెడ్డి, ప్రొఫెసర్ చింతా గణేష్, నాయకులు బ్రహ్మయ్య, మద్దినేని బేబీస్వర్ణకుమారి, మద్ది వీరారెడ్డి, మల్లారెడ్డి, కళ్లెం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎస్సైలు, ఏఎస్సైలను అభినందించిన సీపీ



ఉద్యోగిని అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఎస్సైలుగా, ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన పలువురిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో ఏఎస్సైలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వి.చంద్రశేఖర్‌రావు, బి.పుల్లారావు, కె.నాగేందర్‌రావు ఎస్సైలుగా, హెడ్ కానిస్టేబుళ్లు బి.బస్వనారాయణ, టి.సూర్యచంద్రరావు ఏఎస్సైలుగా ఇటీవల పదోన్నతి పొందారు. వీరిని బుధవారం అభినందించిన సీపీ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఆర్‌ఓఆర్ ముసాయిదాపై నేడు వర్క్‌షాప్

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ నూతనంగా రూపొందించిన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదాపై కలెక్టరేట్‌లో గురువారం వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో మేధావులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, రైతులు పాల్గొనవచ్చని వెల్లడించారు. ఈ మేరకు వీరు ఇచ్చే సలహాలు, మార్పులతో నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

ఆస్పత్రిని పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ బుధవారం పరిశీలించారు. విభాగాల వారీగా తనిఖీ చేసిన అనంతరం ఆయన సూపరింటెండెంట్ చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. టీ హబ్‌లో పరీక్షలు, నివేదికలు, సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. అలాగే, సెంట్రల్ ల్యాబ్‌లో రోజువారీగా డెంగీ పరీక్షల వివరాలు తెలుసుకున్న ఆయన బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ కళావతిబాయి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారిగా పుల్లయ్య

- ప్రస్తుత అధికారి విజయనిర్మల మానుకోటకు బదిలీ



బి.పుల్లయ్య

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ)గా బి.పుల్లయ్యను నియమితులయ్యారు. జిల్లా వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాఖ ఉప సంచాలకులకు ఆన్‌లైన్ ద్వారా బుధవారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సాంకేతిక సహాయ సంచాలకులుగా, పూర్తి అదనపు బాధ్యతలతో డీఏఓగా పనిచేస్తున్న పుల్లయ్యను ఖమ్మంకు కేటాయించారు. ఆయనను జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో సాంకేతిక సహాయ వ్యవసాయ సంచాలకులుగా నియమిస్తూనే డీఏఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే, ప్రస్తుతం ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారిగా ఉన్న ఎం.విజయనిర్మలను మహబూబాబాద్‌కు బదిలీ చేశారు. అంతేకాకుండా మహబూబాబాద్ డీఏఓ అభిమన్యుడును నిజామాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ రైతు శిక్షణా కేంద్రం ఉపసంచాలకులుగా నియమిస్తూనే ఖమ్మం రైతు శిక్షణా కేంద్రం ఉపసంచాలకులుగా బాధ్యతలు అప్పగించారు.

జిల్లా సహకార అధికారిగా గంగాధర్

ఖమ్మంవ్యవసాయం: జిల్లా సహకార అధికారిగా జి.గంగాధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ అసిస్టెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రెరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గంగాధర్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. గతంలో జిల్లా సహకార అధికారిగా పనిచేసిన మురళీధర్‌రావు జూలైలో ఉద్యోగ విరమణ చేయగా ఇన్నాళ్లు భద్రాద్రి జిల్లా సహకార అధికారి ఖుర్షీద్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ స్థానంలో గంగాధర్‌ను నియమించారు.

చదువుతోనే ఉన్నత స్థానం, గౌరవం

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఎర్రుపాలెం: శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగితేనే సమాజంలో గౌరవం లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈమేరకు విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని వాటిని చేరేలా కష్టపడాలని సూచించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేసిన ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆతర్వాత వారితో మాట్లాడి పాఠశాలలో వసతులు, బోధన, మధ్యాహ్న భోజనం ఎలా ఉందని ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉండడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున సద్వి నియోగం చేసుకోవాలని తెలిపారు.



మీనవోలు పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పిల్లలను చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

ఖమ్మంసహకారనగర్: పిల్లలను చట్టప్రకారం దత్తత తీసుకోవాలే తప్ప ఇతర మార్గాలు ఎంచుకోవద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో ఉన్న ఇద్దరు పిల్లలను హైదరాబాద్, ఖమ్మంకు చెందిన దంపతులకు దత్తత ఇవ్వగా ఆయన మాట్లాడారు. సంతానం లేని దంపతులకు దత్తత వరంలా నిలుస్తుండగా.. అనాథ పిల్లలను తీసుకెళ్తున్న వారు మంచి భవిష్యత్, కుటుంబాన్ని ఇచ్చినట్లవుతుందని తెలిపారు. అయితే, పిల్లల కోసం చట్టవిరుద్ధమైన మార్గాలను ఎంచుకోవద్దని ఆయన సూచించారు. ఖమ్మం శిశు గృహలో ఉన్న పిల్లలు కావాలనుకునే వారు https://cara.wcd.gov.in/ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే నిబంధనల ప్రకారం దత్తత ఇస్తామని కలెక్టర్ తెలిపారు.

కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోంది..



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, పక్కన నాయకులు పువ్వాడ, హేమంతరావు, పోటు ప్రసాద్ తదితరులు

- రుణమాఫీపై మంత్రుల్లో భిన్నస్వరాలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: పాలకుల అనుసరిస్తున్న విధానాల నేపథ్యాన కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టు వ్యతిరేకులు సైతం తమ అవసరాన్ని గుర్తిస్తుండగా.. పేద, మధ్యతరగతి ప్రజలు కమ్యూనిస్టుల బలోపేతాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. సీపీఐ ఖమ్మం జిల్లా సమితి నిర్మాణ కౌన్సిల్ సమావేశం బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో బీజీ.క్లెమెంట్ అధ్యక్షతన జరగగా కూనంనేని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేందుకు గాను బలమున్న ప్రతీ చోట పోటీ చేయాలని సూచించారు. అవగాహన, పొత్తును స్వాగతిస్తూనే పార్టీ పోటీచేసే స్థానాల సంఖ్య పెంచాల్సిన అవసరముందని తెలిపారు. కాగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉన్మాదాన్ని రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. ఇక రాష్ట్రంలో రుణమాఫీ సహా కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజల్లో నిరాశ ఉండడమే కాక రుణమాఫీపై మంత్రుల నుంచే భిన్న స్వరాలు వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యాన రైతులు ఆందోళన బాట పడుతున్నందున ప్రభుత్వం తక్షణం స్పందించకపోతే గందరగోళం నెలకొంటుందని చెప్పారు. ఇదికాక మిగతా హామీల అమలుపైనే సత్వర కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకే జరిగే రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర, జాతీయ అంశాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు.

వయనాడ్ బాధితులకు రూ.1.15 లక్షల విరాళం

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన కేరళ రాష్ట్రం వయనాడ్‌లోని బాధితులకు సీపీఐ శ్రేణుల ద్వారా సేకరించిన మొత్తాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శికి అందజేశారు. మొత్తం రూ.1,15,578 చెక్కును కూనంనేనికి జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జీపీ ఎన్నికలకు అడుగులు!

- ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్

ఖమ్మంవన్‌టౌన్: గ్రామపంచాయతీల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా గ్రామాల్లో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేసేందుకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఈమేరకు జిల్లాలోని 589 గ్రామపంచాయతీల పరిధి 5,398 వార్డుల్లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 21వ తేదీలోపు సిద్ధం చేసి వెల్లడించాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు అందాయి. షెడ్యూల్ ఆధారంగా సెప్టెంబర్ 6న జీపీలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో వార్డుల వారీగా జాబితా ప్రదర్శించాల్సి ఉండగా, అదేనెల 9న జిల్లా కేంద్రంలో, 10న మండల కేంద్రాల్లో అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అలాగే, 7నుండి 13వ తేదీ వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి 19వ తేదీలోగా పరిష్కరించి 21వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయాల్లో తుది జాబితా విడుదల చేయాలని తెలిపారు. ఆతర్వాత ఎన్నికల నిర్వహణపై నిర్ణయం వెలువరించే అవకాశముందని తెలుస్తోంది.

శాస్త్రోక్తంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుకను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు.

అధికారుల కోసం పడిగాపులు

నేలకొండపల్లి: రైతుల రుణమాఫీ వెతలు తీరేదెన్నడో తెలియం లేదు. అర్హత ఉన్నా రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద బారులు దీరుతున్నారు. ఇందులో భాగంగానే నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి బుధవారం ఉదయమే వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చారు. అయితే మధ్యాహ్నం వరకు కూడా ఏఓ కార్యాలయం తీయకపోవడంతో పడిగాపులు కాశారు. అసలే రుణమాఫీ రాక ఆవేదనలో ఉన్న తాము పనులు వదిలిపెట్టుకుని వస్తే సమాధానం చెప్పే వారే లేకపోవడంపై మండిపడ్డారు. చివరకు చేసేదేం రైతులు వెనుతిరిగారు. కాగా, ఈ విషయమై ఏఓ వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో రాలేదు.



నేలకొండపల్లి ఏఓ కార్యాలయం వద్ద ఉన్న రైతులు

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

నేలకొండపల్లి/ముదిగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అమలులో మెనూ కచ్చితంగా అమలు చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ ఆదేశించారు. నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంతో ముదిగొండలోని పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరీక్షించడమేకాక హాజరు నమోదు, బోధనపై ఉపాధ్యాయులతో చర్చించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు వచ్చేలా ఇప్పటి నుంచే శ్రద్ధ వహించాలని సూచించారు. కాగా, ముదిగొండ పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలించిన డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమాల్లో నోడల్ ఆఫీసర్ చలపతిరావు, హెచ్‌ఎంలు హరి శ్రీనివాస్, కంభంపాటి శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముదిగొండ : జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

నాణ్యమైన భోజనం అందించాలి

ఖమ్మంరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ శ్రీలత సూచించారు. మండలంలోని తెల్దారుపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సివిల్ సప్లయీస్ డీటీ విజయ్‌బాబుతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలే తప్ప నాణ్యతలో రాజీ పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

క్లుప్తంగా

నేడు ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

ఖమ్మంమయూన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. దమ్మాయిగూడెం, పాలేరు, ఖమ్మం నగరంతో పాటు చింతకాని మండలం జగన్నాథపురం, మత్కేపల్లి, నాగులవంచ, చింతకానిలో ఆయన పర్యటిస్తారు. ఈసందర్భంగా కార్యకర్తలు, నాయకులు పాల్గొని ఎంపీ పర్యటనను విజయవంతం చేయాలని క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

'సుడా' మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) మాస్టర్ ప్లాన్‌పై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ ముసాయిదా వివరాలను స్టేమ్ సంస్థ ప్రతినిధులు ఆయనకు వివరించారు. సుడా మాస్టర్ ప్లాన్‌ను కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అయితే, సుడా పాలకవర్గం లేకపోవడంతో ఆలస్యమవుతుండగా, గడువు నాటికి సిద్ధం చేయాలనే భావనతో కమిషనర్ సమీక్షించినట్లు తెలిసింది.

హైవే భూసేకరణపై మరో స్టే

రఘునాథపాలెం: నాగపూర్ - అమరావతి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూసేకరణను వ్యతిరేకిస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా రైతులు, ప్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో రెండు స్టేలు వచ్చాయి. తాజాగా బుధవారం రఘునాథపాలెం మండలంలోని కలెక్టరేట్ వెనక పది మంది ప్లాట్ల యాజమానులు కోర్టుకు వెళ్లడంతో వారికి అనుకూలంగా స్టే వచ్చిందని భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు తెలిపారు.

డెంగీతో విద్యార్థి మృతి

నేలకొండపల్లి: డెంగీ జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి మృతి చెందాడు. నేలకొండపల్లికి చెందిన షేక్ ఇర్ఫాన్(17) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించడంతో డెంగీగా నిర్ధారణ అయింది. అక్కడే చికిత్స పొందుతూ ఆయన బుధవారం మృతి చెందాడు. ఇటీవలే డీఎంఎల్‌టీ పూర్తి చేసిన ఇర్ఫాన్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఉన్నత చదువుల కోసం ప్రవేశం పొందాడు. త్వరలోనే అక్కడ చేరాల్సి ఉండగా మృత్యువాత పడడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ముదిగొండ: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముదిగొండకు చెందిన గొలుసుల వెంకన్న(55) కొన్నాళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈక్రమంలోనే బాధ భరించలేక ఆయన ఈనెల 19న ఎలుకల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో ఆయన భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఓ.మురళి తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో కత్తితో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన కె.నవీన్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని సంఘయ్యపై నవీన్ దాడి చేశాని పేర్కొన్నారు. అలాగే, మండలంలోని వీవీ.పాలెం పరిధి జగ్యా తండాలో తీజ్ పండుగ సందర్భంగా మూడు రోజుల క్రితం దాడికి పాల్పడిన కేసులో మధు, లాగూర్‌ను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు.

రూ.47 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం కమాన్‌బజార్‌కు చెందిన వ్యాపారి కండెవల్లి ప్రసాద్ రూ.47 లక్షలకు గాను దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. ఆయన భవన నిర్మాణ వ్యాపారంలో ఉండగా పలువురి వద్ద అప్పులు చేశాడు. ప్రస్తుతం తనకు నష్టాలు ఎదురైనందున అప్పులు తీర్చే మార్గం లేదంటూ నలుగురిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం ఐపీ దాఖలు చేశాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,600	3,906
మిర్చి	17,700	9,000
మిర్చి తాలు	9,000	8,000
ఏసీ మిర్చి	19,400	9,000
ఏసీ తాలు	9,100	8,500
పత్తి	7,350	5,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,828

మొదలైన విద్యుత్ ఉత్పత్తి

- కేటీపీఎస్ పదో యూనిట్‌లో వార్షిక మరమ్మతులు పూర్తి
- 65 రోజుల పాటు కొనసాగిన పనులు



కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారం

పాల్వంచ: కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలోని పదో యూనిట్‌లో వార్షిక మరమ్మతులు విజయవంతంగా పూర్తయ్యాయి. 250 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లో 65 రోజుల పాటు జెన్‌కో, బీహెచ్ఈఎల్, సీమాన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించారు. మంగళవారం రాత్రి పనులు పూర్తి చేసి యూనిట్‌ను రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేయగా, బుధవారం 205 మెగావాట్ల విద్యుదుత్పత్తి నమోదైంది. మరమ్మతు పనులకు రూ.16 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, యూనిట్ మరమ్మతు పనులు 45 రోజుల్లోనే పూర్తి కావాల్సి ఉండగా, మరో 20 రోజుల పాటు ఆలస్యమయ్యాయి. జెన్‌కో డైరెక్టర్ బి.లక్ష్మయ్య పలుమార్లు మరమ్మతు పనులను పరిశీలించి పలు సూచనలు చేసినా జాప్యం జరగడం గమనార్హం. ఎట్టకేలకు పలు అవాంతరాలను అధిగమించి ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకొచ్చామని సీఈ ఎం.ప్రభాకర్‌రావు తెలిపారు.

9వ యూనిట్‌లో పునరుద్ధరణ..

కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారంలోని 9వ యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. సోమవారం రాత్రి బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా 250 మెగావాట్ల సామర్థ్యం గల ఉత్పత్తిని అధికారులు నిలిపివేసిన విషయం విదితమే. కాగా మరమ్మతుల అనంతరం యూనిట్‌ను బుధవారం అందుబాటులోకి తీసుకొచ్చి రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు సీఈ తెలిపారు.

ఎంపీ నిధుల్లో వైరాకు ప్రాధాన్యత

లోక్‌సభ సభ్యుడు రఘురాంరెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్

వైరా: లోక్‌సభ ఎన్నికల్లో వైరా నియోజకవర్గం నుంచి తనకు మంచి మెజార్టీ ఇచ్చిన నేపథ్యాన ఎంపీ కోటా నిధుల కేటాయింపులో ఈ నియోజకవర్గానికి ప్రాధాన్యత ఉంటుందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి వెల్లడించారు. వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 185 మందికి రూ.51లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌తో కలిసి బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఆరు గ్యారంటీలు అమలవుతున్నాయని తెలిపారు. రుణమాఫీపై రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని, రూ.2.లక్షలు లోపు రుణాలు తప్పక మాఫీ అవుతాయని తెలిపారు. ఈ విషయంలో ప్రతిపక్ష పార్టీల విమర్శలు పట్టించుకోవలసిన అవసరం లేదని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, నాయకులు కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, దొబ్బల సౌజన్య, దార్న శేఖర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను నిమజ్జనం చేస్తున్న ఈఓ రమాదేవి



గోదావరికి నదీ హారతి సమర్పిస్తున్న వేద పండితులు

వైభవంగా శ్రీరామకోటి పుస్తకాల నిమజ్జనం

భారీగా తరలివచ్చిన రామభక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి భక్తులు సమర్పించిన శ్రీరామకోటి పుస్తకాలను బుధవారం పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో శ్రీరామకోటి పుస్తకాలను మంగళవాయిద్యాలు, అర్చకుల మంత్రోచ్చరణల నడుమ గోదావరి బ్రిడ్జిపైకి తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పుస్తకాలను నిమజ్జనం చేశారు. ఆ తర్వాత గోదావరికి నదీహారతి సమర్పించారు. ఈ వేడుకకు వేలాదిగా భక్తులు తరలిరాగా ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఒక షాపు, తలనీలాల వేలం పాట పూర్తి

ఆదాయం తక్కువ వచ్చినా అప్పగించిన వైనం



బాక్స్‌లో టెండర్ వేస్తున్న పాటదారు

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) పరిధిలో షాపులు కేటాయింపుతో పాటు వివిధ పనుల కోసం బుధవారం వేలం నిర్వహించగా ఒక షాపుతో పాటు తలనీలాలు పోగు చేసుకునే హక్కును వ్యాపారులు దక్కించుకున్నారు. ఆలయానికి చెందిన నూతన కాంప్లెక్స్‌లోని మూడు, పాత కాంప్లెక్స్‌లోని రెండు షాపులతో పాటు తలనీలాల సేకరణ, గతంలో సేకరించిన తలనీలాల విక్రయం, ఇతర పనుల కోసం వేలం నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పర్యవేక్షణాధికారి పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారి పర్యవేక్షించగా పాత కాంప్లెక్స్‌లోని నాలుగో నంబర్ షాపు కోసం నలుగురు పోటీ పడగా నెలకు రూ.42వేల అద్దెతో దక్కించుకున్నారు. అయితే, గతంలో ఇదే షాపును రూ.46వేల అద్దెతో కేటాయిస్తే ఈసారి రూ.4వేలు తక్కువకే అప్పగించడం గమనార్హం. ఇక తలనీలాలు పోగు చేసుకునేందుకు ఐదుగురు టెండర్లు దాఖలు చేయగా 11నెలల కాలానికి రూ.9.50లక్షలతో అప్పగించారు. గత ఏడాది రూ.24లక్షలకు కేటాయించగా ఈసారి రూ.9.50లక్షలకే అప్పగించడంతో రూ.14.50లక్షల ఆదాయానికి గండి పడింది. కాగా, మిగతా షాపులు, ఇతర పనుల కోసం ఎవరూ ముందుకు రాకపోవడంతో వచ్చే నెల 2వ తేదీకి వేలం వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. అలాగే, షాపు, తలనీలాల హక్కులను తక్కువకు కేటాయించడంపై స్పందిస్తూ ఆరు సార్లు వేలం నిర్వహించినా ఇదే పరిస్థితి ఉండడంతో నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

కాంట్రాక్టు ఉద్యోగి నుంచి రూ.50 లక్షలు రికవరీ?

ఖమ్మం సహకారనగర్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగి రామకృష్ణ శాఖకు సంబంధించి రూ.1.82లక్షల నిధులు స్వాహా చేయగా అధికారుల ఫిర్యాదుతో పోలీసులు గతంలోనే కేసు నమోదు చేశారు. ఇందులో నుంచి బుధవారం రూ.50 లక్షలను రామకృష్ణ చెల్లించినట్లు తెలిసింది. ఈ నిధులు రెండు రోజుల్లో ఖాతాలో జమ అయ్యేఅవకాశముందని సమాచారం. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో అధికారులు నిధుల రికవరీపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా రామకృష్ణ రూ.50లక్షలు చెల్లించగా మిగతా నిధులను సైతం పది రోజుల్లో రాబట్టే అవకాశముందని సమాచారం.

గుర్తు తెలియని వారికి పాత ఫోన్లు అమ్మొద్దు..

ఖమ్మంక్రైం: సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారు వినియోగించుకునేందుకు గాను పాత సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తున్నారని.. అలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిందర్ ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల రామగుండం పోలీసులు బీహార్ రాష్ట్రం హతియా దియారా ప్రాంతానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేయగా 4వేల పాత ఫోన్లు లభించాయని తెలిపారు. సైబర్ నేరాల్లో ఉయోగించేందుకు వారు పాత ఫోన్లను కొంటున్నట్లుగా తేలిందని చెప్పారు. ఇలాంటి కేసుల్లో ఫోన్ వివరాల ఆధారంగా అమ్మిన వారికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. ఈ నేపథ్యాన గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్లు అమ్మొద్దని, అలాంటి వారు తారసపడితే సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ నంబర్ 87126 65556కు సమాచారం ఇవ్వాలని ఏసీపీ సూచించారు.

త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంఅర్బన్: ఉపాధ్యాయులుగా ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను త్వరలోనే సాధిస్తామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు వెల్లడించారు. సంఘం సభ్యత్వం నమోదును బుధవారం రోటరీనగర్, బాలాజీనగర్, పాండురంగాపురం, బల్లేపల్లి, పుట్టకోట, కొత్తగూడెం, వెలుగుమట్ల, వెంకటాయపాలెం, వేపకుంట్ల, చిమ్మపూడి, కోయచలక, పాఠశాలల్లో చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వీస్ రూల్స్‌కు సంబంధించి విధివిధనాలు ఖరారు చేయాలని ఇప్పటికే సీఎం అధికారులను ఆదేశించారని తెలిపారు. ఇవి అమల్లోకి వస్తే అర్హులకు పదోన్నతులు లభిస్తాయని చెప్పారు. కాగా, పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికుల నియామకం, ఉచిత విద్యుత్ అమలుపై సానుకూల నిర్ణయాన్ని తీసుకున్న ప్రభుత్వం పెండింగ్ డీఏలు, పీఆర్సీ, ఉద్యోగ, పెన్షనర్లకు నగదు రహిత చికిత్సపై త్వరలో ఉత్తర్వులు ఇస్తారనే నమ్మకం ఉందని తెలి పారు. ఈ సమావేశాల్లో ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలా అధ్యక్ష కార్యదర్శులు టి.స్వామి, ఎల్.సాంబశివరావు, సర్వర్‌మియా, కేశవరావుతోపాటు కట్టా శేఖర్, ఎల్.సతీష్, సోమ్లానాయక్, సైదుబాబు, సుజాత, నఫీజ, అరుణ, రాయల నర్సింహారావు, రాములు, నాగిరెడ్డి, రవికిరణ్, సత్యం, జబ్బార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'నారీశక్తి' ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నారీశక్తి బాధ్యులు, అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్: కోల్‌కత్తా వైద్యవిద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్‌తో ఖమ్మంలో బుధవారం ఇంటర్ విద్య నారీశక్తి ఉమ్మడి జిల్లా కమిటీల ఆధ్వర్యాన ఆధ్వర్యాన బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి పాత ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించగా పలువురు మాట్లాడారు. ఘటన జరిగి రోజులుగా గడుస్తున్నా నిందితులను గుర్తించకపవడం గర్హనీయమన్నారు. ఇకనైనా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నారీశక్తి బాధ్యులు నీరజ, ప్రమీల, నవీన, జ్యోతి, విజయలక్ష్మి, లలిత అనిత, సరళ, లావణ్య, శ్వేత, మానస, రాజ్యలక్ష్మి, సుమమాలిని, టీజీవోస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వేలాద్రి, ప్రిన్సిపాల్ వాసిరెడ్డి, అధ్యాపకులు సతీష్, శేషు, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యవసాయ, ఉద్యాన అధికారులకు ప్రశంసాపత్రాలు



డీఈఓ విజయనిర్మలను సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం/తిరుమలాయపాలెం: వ్యవసాయ, ఉద్యానశాఖల్లో పలువురిని స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. అయితే, ఆరోజు సీఎం పర్యటన కారణంగా అధికారులంతా వైరా వెళ్లడంలో వారికి బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, ఖమ్మం ఏడీఏ ఏ.శ్రీనివాసరావు, తిరుమలాయపాలెం ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డితో పాటు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాభివృద్ధి శాఖ కంప్యూటర్ ఆపరేటర్ ఎస్.కే.ఖలీల్‌పాషా, సహాయ పట్టు పరిశ్రమ అధికారి కామేశ్వరరావు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కాగా, జిల్లా నుంచి బదిలీ అయిన డీఏఓ విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాసరావు కలెక్టర్, అధికారులు సన్మానించారు.







ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ సీతారాంరెడ్డి, ఉద్యాన శాఖ ఉద్యోగి ఖలీల్‌పాషా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రఘునాథపాలెం: రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు రఘునాథపాలెంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని గురుకులాల ఆర్‌సీఓ అంజలి తెలిపారు. పాఠశాలక చెందిన లోకేష్, గణేష్, ఎస్.నాగచైతన్య, సాయి, సాయి మణికంఠ, కాళీచరణ్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చగా ఈనెల 25, 26వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీరిని ఆర్‌సీఓతోపాటు హెచ్‌ఎం సంజీవరావు, పీఈటీ కృష్ణ బుధవారం అభినందించారు.

అనారోగ్యం, ప్రేమ విఫలమై ఆత్మహత్య

ఖమ్మంరూరల్: అనారోగ్యానికి తోడు ప్రేమ విఫలమైందనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కొండాపురం శివారు సీతారాంపురానికి చెందిన వేమూరి గురునాథరావు (24) కొన్నాళ్లుగా అనారో గ్యంతో బాధపడుతున్నాడు. ఇంతలోనే ప్రేమ విఫలం కావడంతో ఆవేదనకు లోనైనా ఆయన ఈనెల 18న పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు ఖమ్మంలో చికిత్స చేయించాక హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన తల్లి ఉప్పలమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

కట్లేరులో పడి వ్యక్తి గల్లంతు



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరెడ్డి(50) బుధవారం ప్రమాదవశాత్తు కట్లేరులో పడి గల్లంతయ్యాడు. ఆయన గేదెలను మేతకు తీసుకెళ్లగా అవి నీటి కోసం కట్లేరులోకి దిగాయి. ఈమేరకు వాటిని బయటకు తీసుకొచ్చేందుకు ఆయన కూడా దిగగా నీటి గుంతలో మునిగి గల్లంతయ్యాడు. సమీపంలో ఉన్న స్థానికులు చేరుకుని గాలించినా రాత్రి వరకు ఆచూకీ దొరకలేదు. కాగా, శ్రీనివాసరెడ్డికి భార్య వెంకటరావమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

చింతకాని: మండల పరిధిలోని పాతర్లపాడుకు పూనాటి శ్రీనివాసరావు కానరాకుండా పోవడంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఒంటరిగా నివసించే శ్రీనివాసరావు గతనెల 22వ తేదీన బ్యాగ్‌లో బట్టలు పెట్టుకుని ఇంటి వెళ్లి తిరిగి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం ఎక్కడా గాలించినా ఆచూకీ లేకపోవడంతో శ్రీనివాసరావు సోదరి నెల్లూరి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

బెదిరించిన ఘటనలో నలుగురిపై ...

చింతకాని: భూమి విషయమై బెదిరించిన నలుగురిపై బుధవారం కేసు నమోదైంది. ఖమ్మంకు చెందిన జట్ల ప్రసాద్‌రావు 2012లో చింతకాని మండలం వందనం రెవెన్యూలో 36 కుంటల వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. అయితే, ఆ భూమిలో వందనం గ్రామానికి చెందిన ఆవుల కాటంరాజు, రామారావు, హరీష్, రమేష్ ఫెన్సింగ్ రాళ్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రసాద్‌రావు ప్రశ్నించగా ఆయనను చంపుతామని బెదిరించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

తలుపులు పగులగొట్టి చోరీ

ముదిగొండ: మండలంలోని వల్లబిలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ చేశారు. గ్రామానికి చెందిన నాగేశ్వరరావు ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. అయితే, ఇంటి తలుపులు పగలగొట్టి చోరీ చేసినట్లు స్థానికులు సమాచారం ఇవ్వగా పోలీసులు పరిశీలించారు. ఈమేరకు అందిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఓ.మురళి తెలిపారు.

మావోయిస్టు పీఎల్‌జీఏ సభ్యుడి లొంగుబాటు

చర్ల: మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ హిడ్మా బెటాలియన్ నంబర్–1లో పని చేస్తున్న పీఎల్‌జీఏ క్రియాశీలక సభ్యుడైన ఓ మైనర్ బుధవారం ఒడిశాలోని ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధి సిలిగేరు గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడు ముఖేష్ కొర్సా 2023లో మావోయిస్టు పార్టీలో చేరాడు. హిడ్మా నేతృత్వంలో అతను పనిచేస్తుండగా, ఇప్పటివరకు ఐదు కేసులు ఉన్నాయి. లొంగిపోయిన ముఖేష్‌పై ఒడిశాలో రూ. 2 లక్షల రివార్డు ఉండగా, దానిని ఇప్పించేందుకు కృషి చేస్తామని అక్కడి పోలీసులు తెలిపారు.

90 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద ఎస్‌ఐ, సిబ్బంది

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు నుండి తరలించేందుకు సిద్ధం చేసిన 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నట్లు తిరుమలాయపాలెం ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు. పిండిప్రోలుకు చెందిన మడికంటి రాము ఒక వ్యాన్‌లో 30 బస్తాలు, కాకినాడ జిల్లా చేబ్రోలుకు చెందిన కోటిపల్లి మణికంఠ మరో వ్యాన్‌లో 150 బస్తాలు కలిపి సుమారు రూ.2.7లక్షల విలువైన 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లోడ్ చేసి ఆంధ్రా తరలించేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు సమాచారం అందుకున్న ఎస్సై సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో రాము, మణికంఠ, ఓ డీలర్‌తో పాటు నేరెల్ల గిరి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యాపారి శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.లక్ష విలువైన టేకు దుంగలు...



టేకు దుంగలను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: మండలంలోని రాంనగర్ తండాలో అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను ఖమ్మం అటవీశాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందదిన ధర్మసోత్ సూర్య ఇంట్లో టేకు దుంగలు నిల్వ ఉన్నాయనే సమాచారంతో తనిఖీ చేపట్టగా రూ.లక్ష విలువైన 29 దుంగలు లభ్యమయ్యాయి. వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగమణి, సెక్షన్ ఆఫీసర్లు కిషోర్, చక్రవర్తి, ఎఫ్‌బీఓలు రాంబాబు, రాధ, చక్రవర్తి పాల్గొన్నారు.

14 కేజీల గంజాయి..



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ అధికారులు బుధవారం చేపట్టిన తనిఖీల్లో 14.7కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బల్లేపల్లి గణేష్ టౌన్‌షిప్ వెనకాల ఖాళీ ప్రదేశంలో సోదాలు చేపట్టగా గంజాయి లభించిందని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.తిరుపతి, ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కృష్ణ తెలిపారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ కరీం బాబు, కానిస్టేబుళ్లు సుధీర్, హరీష్, హన్మంతరావు, వెంకట్, విజయ్, ఉపేందర్ పాల్గొన్నారు.